# గ్రామీణ పేద పిల్లలకు ప్రపంచ స్థాయి విద్యే లక్ష్యం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**సూర్యాపేట, జూలై 3**

గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం రెసిడెన్షియల్ విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, ఆహార ఉ పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో రూ.250 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, హుజూర్‌నగర్ నియోజక వర్గంలోని వేలాది గ్రామీణ విద్యార్థులకు ప్రపంచ స్థాయి ఇంగ్లీష్ మీడియం బోర్డింగ్ విద్యను అందించేందుకు ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. రూ.250 కోట్లతో నిర్మితమవుతున్న ఈ క్యాంపస్‌లో ఒకేసారి 2,500 మంది విద్యార్థులు చదువుకునేలా అత్యాధునిక తరగతి గదులు, వసతి గృహాలు, క్రీడా మైదానాలు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం గుత్తేదారులు, ఇంజినీర్లు వేగంగా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని, పనుల పురోగతిని స్వయంగా పరిశీలించేందుకే సందర్శించినట్లు మంత్రి తెలిపారు. వచ్చే ఏడాది



(2027) నాటికి నిర్మాణ పనులు పూర్తిచేసి, 2027-28 విద్యా సంవత్సరంలో తరగతులను ప్రారంభించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, ఇన్‌చార్జి తహసీల్దార్ స్రవంతి, ఆర్ అండ్ బి ఎస్‌సీ సీతారామయ్య, గుత్తేదారులు, ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల కమిషన్ సుమోటో గా విద్యా వ్యవస్థపై విచారణ

**ప్రభుత్వ పాఠశాలల దుస్థితిపై నివేదిక కోరిన కమిషన్**

**హైదరాబాద్, జూలై 3**

తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న మౌలిక వసతుల కొరత, తరగతి గదుల లేమి, మరుగుదొడ్ల కొరత వంటి సమస్యలపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించడం రాష్ట్ర విద్యా రంగంలో కీలక పరిణామంగా మారింది. ఇటీవల వెలువడిన పత్రికా కథనాలను పరిశీలించిన కమిషన్ ఛైర్మన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ ఈ అంశంపై స్వయంగా స్పందించి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చెట్ల కింద, వరండాల్లో, సామాజిక భవనాల్లో చదువుకోవాల్సి వస్తోందని, అనేక చోట్ల మరుగుదొడ్లు, తరగతి గదులు వంటి కనీస సౌకర్యాలు కూడా లేవన్న ఆరోపణలను తీవ్రంగా పరిగణించారు. ఈ పరిస్థితులు విద్యార్థుల విద్య హక్కు, గౌరవప్రదమైన జీవనం, ఆరోగ్యం, భద్రత వంటి రాజ్యాంగ హక్కులను ప్రభావితం చేస్తున్నాయని కమిషన్ ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసిన కమిషన్, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల వాస్తవ పరిస్థితి, మంజూరైన తరగతి గదుల నిర్మాణ స్థితి, జాప్యానికి కారణాలు, మరుగుదొడ్లు మరియు ఇతర సౌకర్యాల లభ్యత, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ నివేదికను ఆగస్టు 3, 2026న కమిషన్ ఎదుట సమర్పించాలని పేర్కొంది. విద్యను మౌలిక హక్కుగా గుర్తించిన రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు మానవ హక్కుల కమిషన్ స్వయంగా జోక్యం చేసుకోవడం ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలపై సమగ్ర సమీక్షకు దారి తీసే అవకాశముందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వెలుగు వెంకన్న

**సూర్యాపేట, జూలై 3**

కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట పట్టణ అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన 48వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు సంబరాలు నిర్వహించి బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు. వెలుగు వెంకన్న రాజకీయ ప్రస్థానం 2000 సంవత్సరంలో టీడీపీలో ప్రారంభమైంది. అప్పట్లో పెద్దిరెడ్డి రాజా ఆధ్వర్యంలో పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు. 2014లో టీడీపీ పట్టణ కార్యదర్శిగా పనిచేయగా, అదే ఏడాది ఆయన సతీమణి వెలుగు సంతోషి టీడీపీ తరపున కౌన్సిలర్‌గా విజయం సాధించారు. 2017లో తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరిన వెంకన్న, అప్పటి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. 2019, 2026 ఎన్నికల్లో వరుసగా 48వ వార్డు కౌన్సిలర్‌గా విజయం సాధించారు. గతంలో మున్సిపల్ చైర్మన్ పదవి అవకాశం చేజారగా, 2026లో వైస్ చైర్మన్ పదవిని ఆశించినప్పటికీ దక్కలేదు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకమైన సందర్భంగా వెలుగు వెంకన్న మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసీసీ నాయకులు సర్వోత్తమ్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని పట్టణంలో మరింత బలోపేతం చేసి, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వెలుగు వెంకన్నకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# చిన్నారుల రక్షణపై నేడు న్యాయ అవగాహన కార్యక్రమం

**పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్న జిల్లా న్యాయ సేవా సంస్థ**

**సూర్యాపేట, జూలై 3**

చిన్నారులపై లైంగిక వేధింపుల నివారణ, పోక్సో చట్టంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు జిల్లా న్యాయ సేవా సంస్థ (ఋూఌూ) ప్రత్యేక న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ మేరకు జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. సురేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమం జూలై 4న ఉదయం 11 గంటలకు సూర్యాపేట పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు మహిళా సంక్షేమ, శిశు సంక్షేమ, పోలీసు, విద్యాశాఖల సమ న్వయంతో కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ కార్యక్ర మాని కి ఐ అదనపు జూనియర్ సివిల్ జడ్జి హాజరై విద్యార్థు లకు పోక్సో చట్టం, చిన్నారుల హక్కులు, రక్షణ చర్యలు, లైంగిక వేధింపులను ఎలా గుర్తించాలి, ఎవరికి ఫిర్యాదు చేయాలి వంటి అంశాలపై అవగాహన కల్పించ నున్నారు. కార్యక్ర మంలో బార్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా న్యాయ సేవా సంస్థ సభ్యులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్, పారా లీగల్ వాలంటీర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొని విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించనున్నారు.

# భూమి కోసం వీర తెలంగాణ... అస్తిత్వం కోసం ప్రత్యేక తెలంగాణ... అధికారం కోసం సామాజిక తెలంగాణ

**భువనగిరి నుంచే సామాజిక తెలంగాణ పోరాటానికి శంఖారావం:**

**వట్టే జానయ్య యాదవ్**

**భువనగిరి, జూలై 3**

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న అసలు పోరాటం రాజ్యాధికారం కోసం జరుగుతున్న పోరాటమేనని, ఆ పోరాటానికి చారిత్రక ఆరంభంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఈ నెల 5న భువనగిరిలో "సామాజిక న్యాయ సమరభేరి" బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సభ నిర్వహణ బాధ్యులు వట్టే జానయ్య యాదవ్ స్పష్టం చేశారు. శుక్రవారం భువనగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "భూమి కోసం వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగింది... అస్తిత్వం కోసం ప్రత్యేక తెలంగాణ ఉద్యమం జరిగింది... ఇప్పుడు అధికారం కోసం సామాజిక తెలంగాణ ఉద్యమం ప్రారంబ౯మవుతోంది" అని అన్నారు. భువనగిరి గడ్డపై అమర గాయని బెల్లి లలిత త్యాగస్ఫూర్తికి, సూర్యాపేటకు చెందిన అమరుడు మారోజు వీరన్న పోరాట వారసత్వానికి, తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన ఎందరో అమరవీరుల త్యాగాలకు సాక్షిగా సామాజిక తెలంగాణ ఉద్యమానికి ఇదే నాంది పలుకుతున్నామని ఆయన పేర్కొన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ వంటి బడుగు బలహీన వర్గాల నాయకులు తమ రక్తాన్ని ధారపోసి భూమి కోసం పోరాడారని, ఆ పోరాటం భూస్వామ్య వ్యవస్థకు సవాల్ విసిరి పీడిత ప్రజలకు విముక్తి మార్గాన్ని చూపిందని అన్నారు. అనంతరం జరిగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంత్ ఆచారితో పాటు వేలాది మంది యువకులు, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ఆత్మబలిదానాలు చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావానికి సిద్ధాంత దిక్సూచిగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ కూడా బడుగు బలహీన వర్గాల నుంచే ఎదిగిన మహానేత అని పేర్కొంటూ, ఆయన చూపిన సామాజిక న్యాయ మార్గంలోనే ఇప్పుడు సామాజిక తెలంగాణ నిర్మాణ యాత్ర ప్రారంభ మవుతోందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా, ప్రజాస్వామ్యం పేరుతో బడుగు బలహీన వర్గాలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగానే ఉపయోగించారని విమర్శిం చారు. దేశ సంపదను సృష్టించే శ్రమజీవులు అధికారానికి మాత్రం దూరంగా ఉంచబడ్డారని, ఈ అన్యాయానికి ముగింపు పలికే సమయం వచ్చిందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కలలు కన్న రాజకీయ, సామాజిక సమానత్వాన్ని సాధించాలంటే జనాభాకు తగిన అధికార వాటా తప్పనిసరిగా రావాలని, అదే తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఉద్యమ లక్ష్యమని స్పష్టం చేశారు. భువనగిరి సభ ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా ఈ సభపై విశేష చర్చ జరుగుతోందని చెప్పారు. తెలంగాణ నలుమూలల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా లక్షలాదిగా తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. బడుగు, బలహీన, బహుజన వర్గాల ప్రజలందరూ ఈ సభకు భారీ సంఖ్యలో హాజరై "ఆత్మగౌరవం కోసం... అధికారంలో వాటా కోసం... సామాజిక తెలంగాణ నిర్మాణం కోసం..." తమ గళాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు. "భూమి కోసం పోరాడిన వీర తెలంగాణకు వారసులం... అస్తిత్వం కోసం సాధించుకున్న ప్రత్యేక తెలంగాణకు సంరక్షకులం... ఇప్పుడు అధికారం కోసం సామాజిక తెలంగాణను నిర్మించడం మన చారిత్రక బాధ్యత" అని వట్టే జానయ్య యాదవ్ పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ చిలుకూరు మండల అధ్యక్షుడిగా కీత వెంకటేశ్వర్లు పునర్నియామకం

**చిలుకూరు, జూలై 3**

చిలుకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రామాపురం గ్రామానికి చెందిన కీత వెంకటేశ్వర్లు రెండోసారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మరోసారి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డికి కృతజతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని, మండ లంలోని ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. కీత వెంకటేశ్వర్లుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభి ఒమానులు శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



# విరసం ఆవిర్భావ సభకు రావాలి

**ప్రజాస్వామికవాదులకు నిర్వాహకుల పిలుపు**

**సూర్యాపేట, జూలై 3**

దేశంలో ప్రజా ఉద్యమాలపై కొనసాగుతున్న ఫాసిస్టు నిర్బంధం, అణచివేతకు వ్యతిరేకంగా సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో పోరాటాలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో జూలై 5 (ఆదివారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విప్లవ రచయితల సంఘం (విరసం) ఆవిర్భావ సభ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి నల్గొండ జిల్లా విరసం సభ్యులు కిన్నెర, సమీర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాస్వామికవాదులు, రచయితలు, కళాకారులు, విద్యార్థులు, యువజనులు అధిక సంఖ్యలో సభకు హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఆవిర్భావ సభ ప్రచారంలో భాగంగా సూర్యాపేటలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సభ కరపత్రాన్ని విరసం, వివిధ ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం. డేవిడ్ కుమార్, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య, సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ ఎల్. భద్రయ్య, బహుజన మహాసభ రాష్ట్ర నాయకుడు ఎన్. వెంకట్ యాదవ్, టీపీఎఫ్ కన్వీనర్ జి. కోటయ్య, రైతాంగ సమితి జిల్లా అధ్యక్షుడు ఎం. మాధవరెడ్డి, పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కే. సైదులు, పీడీఎస్‌యూ నాయకులు భరత్, అఖిల్, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆర్. లింగయ్య, పి. వెంకటేశ్వర్లు, సీహెచ్. వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో దేశంలోనే తొలి సమగ్ర ఆంకాలజీ తయారీ కేంద్రం ప్రారంభం

**హైదరాబాద్, జూలై 3**

తెలంగాణలో దేశంలోనే తొలి సమగ్ర (ఇంటిగ్రేటెడ్) ఆంకాలజీ ఔషధ తయారీ కేంద్రం ప్రారంభానికి సిద్ధమైంది. సిద్ధిపేట జిల్లా మార్కూక్ మండలం కరకపట్లలోని బయోటెక్ పార్క్--ఫేజ్-3లో సిరో ఫార్మా ప్రైవేట్ మిటెడ్ . అత్యాధునిక ఆంకాలజీ, సాఫ్ట్‌జెల్ ఫార్ములేషన్ తయారీ కేంద్రాన్ని ఈ నెల 6న ప్రారంభించనుంది. ఈ అత్యాధునిక తయారీ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభిం చనుండగా, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ముఖ్య అతిథులు గా హాజరుకానున్నారు. సంస్థ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఈ ప్లాంట్‌లో నోటి ద్వారా తీసుకునే క్యాన్సర్ మందులు, స్టెరైల్ ఇంజెక్షన్లు, లయోఫిలైజ్డ్ పౌడర్ ఇంజెక్షన్లు, ఆంకాలజీ సాఫ్ట్‌జెల్ క్యాప్సూల్స్‌ను అత్యాధునిక కంటైన్‌మెంట్ సాంకేతికతతో తయారు చేసే సామర్థ్యం ఉంది. భారతదేశంలోనే తొలిసారిగా ఆంకాలజీ ఔషధాల తయారీ కోసం పూర్తిస్థాయి సమగ్ర నిరంతర ఉత్పత్తి (జశీత్‌ఱఅబశీబం మీఱఅబఝఖ్షబతీఱఅర్థ) విధానంలో పనిచేసే జీఈఏ (+జూూ) తయారీ లైన్‌ను ఈ కేంద్రంలో ఏర్పాటు చేశారు. అత్యంత శక్తివంతమైన సైటోటాక్సిక్ ఔషధాలను ూజుూ లెవల్--5 ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తి చేసే సామర్థ్యం ఈ కేంద్రానికి ఉంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పరిశోధన, అభివృద్ధి (=ఉఐ), కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ (జఐవీూ) సౌకర్యాలతో ఈ కేంద్రం అమెరికా, యూరప్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి నియంత్రిత అంతర్జాతీయ మార్కెట్ల అవసరాలను తీర్చనుంది. ఈ ప్లాంట్ ఇప్పటికే ఔూ--+వీూ, ూ×జ/ూ +వీూ, జూూఝఖ ప్రమాణాలకు సంబంధించిన అనుమతులు పొందింది. ప్రస్తుతం సిరో ఫార్మా సంస్థకు 18 ఆంకాలజీ ఔషధాలు, సుమారు 20 సాఫ్ట్‌జెల్ ఫార్ములేషన్లు, అలాగే న్యూట్రాస్యూటికల్స్, ఫుడ్ సప్లిమెంట్ల తయారీకి లైసెన్సులు ఉన్నట్లు సంస్థ వెల్లడించింది.




# ప్రజలకు వేగవంతమైన పోలీసు సేవలే లక్ష్యం

**సాంకేతికత వినియోగంతో సమర్థవంతమైన పోలీసింగ్‌కు డీజీపీ ఆదేశం**

**వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సూర్యాపేట ఎస్పీ నరసింహ**

సూర్యాపేట, జూలై 3

రాష్ట్రంలో ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించాలని తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన వివిధ అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ పాల్గొన్నారు. సమావేశంలో కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, ఆన్‌లైన్ కేసు నిర్వహణ, సీసీటీవీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ పనితీరు, ఈ-సాక్ష పోర్టల్ వినియోగం, ఇంటి వద్ద నుంచే కేసుల నమోదు, డయల్-100 ఫిర్యాదులపై స్పందన, ప్రజలకు అందుతున్న పోలీసు సేవలు, నేరస్థులకు శిక్షల అమలు, కోర్టులతో సమన్వయం తదితర అంశాలపై డీజీపీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పెండింగ్ కేసులను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, డయల్-100కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి బాధితులకు భరోసా కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో డయల్-100 స్పందన, బ్లూకోల్ట్, పెట్రోకార్ విధులు, కేసుల ఆన్‌లైన్ నమోదు, ఈ-సాక్ష పోర్టల్ వినియోగం, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ పనితీరు తదితర అంశాల్లో అమలు చేస్తున్న చర్యలను జిల్లా ఎస్పీ నరసింహ డీజీపీకి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మంజు భార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, క్లూస్ టీమ్ ఇన్‌స్పెక్టర్ నవీన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్‌తో పాటు ఐటీ కోర్, సీసీఎస్, కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.




# సీఐటీయూలో చేరిన జేబీఎం ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్లు

**30 మంది సభ్యులతో నూతన కమిటీ ఎన్నిక**

సూర్యాపేట, జూలై 3

ఆర్టీసీ జేబీఎం ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్లు తమ హక్కుల సాధన, ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూలో చేరారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. రాంబాబు సమక్షంలో వారు సంఘంలో సభ్యత్వం స్వీకరించారు. అనంతరం 30 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జేబీఎం డ్రైవర్లు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, తమ హక్కుల సాధన కోసం సీఐటీయూను ఆశ్రయించడం శుభపరిణామమని అన్నారు. నెలకు 13 డ్యూటీలు నిర్వహిస్తున్న డ్రైవర్లు ఒక్కరోజు విధులకు హాజరుకాకపోతే రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వేతనాల్లో కోత విధించడం అన్యాయమని విమర్శించారు. పీఎఫ్, హెల్త్ స్కీమ్ వంటి అంశాల్లో యూనివర్సల్ కంపెనీ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తోందని ఆరోపించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. రాంబాబు మాట్లాడుతూ, సమస్యలపై ప్రశ్నించిన కార్మికులను విధుల నుంచి తొలగించడం, భయభ్రాంతులకు గురిచేయడం సరైన విధానం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాల వల్ల కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, కార్మిక వ్యతిరేక చట్టాలతో ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకునే వరకు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్, రీజియన్ కోశాధికారి కారి బైరు శ్రీకాంత్ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకోగా, గౌరవ అధ్యక్షుడిగా నెమ్మాది వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా జానకి రాములు, కార్యదర్శిగా కిరణ్, కోశాధికారిగా ఉపేందర్ నాయక్, ఉపాధ్యక్షులుగా మధుసూదన్, రాము, నవీన్ రెడ్డి, సుదర్శన్, ఉమేష్, సహాయ కార్యదర్శులుగా సైదులు, లింగయ్య, నాగరాజు, శరత్, అశోక్ ఎన్నికయ్యారు. సభ్యులుగా సంజీవ్, సురేష్, మహేష్, వెంకన్న, రవి, శివకృష్ణ తదితరులు ఎన్నికయ్యారు.



# మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కోతి గోపాల్ రెడ్డి పునర్నియామకం

సూర్యాపేట, జూలై 3



కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట మండల అధ్యక్షుడిగా సూర్యాపేట మండలం కాసర బాద గ్రామ సర్పంచ్ కోతి గోపాల్ రెడ్డి వరుసగా రెండోసారి నియమితులయ్యారు. కోతి గోపాల్ రెడ్డి 2019లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిం చారు. అనంతరం 2021లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమి తులై, ప్రస్తుతం మరో సారి అదే పదవికి ఎంపిక య్యారు. స్థానిక ప్రజాప్రతినిధిగా రెండు పర్యాయాలు కాసర బాద గ్రామ ఉపసర్పంచ్‌గా సేవలందించిన ఆయన, ప్రస్తుతం గ్రామ సర్పంచ్‌గా కొనసా గుతు న్నారు. ఈ సందర్భంగా కోతి గోపాల్ రెడ్డి మాటా డుతూ తనపై విశ్వా సం ఉంచి మరో సారి మం డల అధ్యక్ష బాధ్యతలు అప్ప గించిన పార్టీ నాయక త్వానికి, ముఖ్యంగా ఏఐసీ సీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్త మ్ రెడ్డికి కృతజ్ఞ తలు తెలి పారు. పార్టీని మండ లంలో మరింత బలోపేతం చేయడం తోపాటు కార్యకర్తలకు ఎల్లప్పు డూ అందు బాటులో ఉంటూ కాంగ్రెస్ సిద్ధాం తాలను ప్రజల్లోకి తీసు కెళ్లేందుకు కృషి చేస్తానని అన్నారు. ఆయన పునర్ని యామకంపై పార్టీ నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

# కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌కు సహకరించండి: వామపక్ష విద్యార్థి సంఘాలు

సూర్యాపేట, జులై 3




విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న నిర్వహించనున్న కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చాయి. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని వారు విమర్శిం చారు. ఇప్పటి వరకు విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రిని నియమించకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలోని 24 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకే పరిమితం చేసే ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, పెండింగ్‌లో ఉన్న రూ.9,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని కోరారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను సకాలంలో అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్స్ బలవంతపు విక్రయాలను నిలిపివేయాలని, లిలిజాతీయ విద్యా విధానం--2020 (ఎన్ఈపీ-2020)లిలిను తెలంగాణలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జులై 10న జరిగే విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా సహకరించి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు ప్రవీణ్, శశి, మహేష్, నవీన్, పవన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎల్‌నినో ప్రభావం.. రైతులు

# అప్రమత్తంగా ఉండాలి

**పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచన**

సూర్యాపేట, జూలై 3

ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాలు బలహీనపడిన నేపథ్యంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ, తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంచుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశా రు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించిన మంత్రి వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయం పండుగలా మారిందన్నారు. రికార్డు స్థాయిలో వరి దిగుబడి సాధించడంతో పాటు భారీ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామని, ఏడు రకాల సన్న వరి ధాన్యాలకు బోనస్‌ను కూడా కొనసాగిస్తున్నామని తెలిపారు. అయితే ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షపాతం తగ్గిందని, రైతులు వాతావరణ పరిస్థితులను నిరంతరం గమనిస్తూ వాటికి అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 2026 జూన్ నెలలో దేశవ్యాప్తంగా సాధారణంతో పోలిస్తే సుమారు 40 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, ఇటీవలి కాలంలో ఇది అత్యంత పొడి జూన్ నెలల్లో ఒకటిగా నిలిచిందన్నారు. తెలంగాణలో కూడా జూన్ నెలలో సుమారు 22 శాతం తక్కువ వర్షపాతం నమోదవడంతో పలు ప్రాంతాల్లో విత్తనాల విత్తడం ఆలస్యమైందని చెప్పారు. గోదావరి పరివాహక ప్రాంతంలో మహారాష్ట్రలో కూడా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో తెలంగాణకు గోదావరి జలాల ప్రవాహం ఆలస్యమవుతోందని వివరించారు. నీటి లభ్యత అనిశ్చితంగా ఉన్న ప్రాంతాల్లో అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే, ఎండలను తట్టుకునే పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. రిజర్వాయర్లలోని నీటిని అత్యంత పొదుపుగా వినియోగిస్తూ ముందుగా తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అనంతరం సాగునీటి అవసరాలను తీర్చేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. వర్షపాతం, జలాశయాల్లో నీటి నిల్వలను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, పరిస్థితులకు అనుగుణంగా తగిన నిర్ణయా లు తీసుకుంటామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని, రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. సరైన ప్రణాళిక, నీటి సమర్థ వినియోగం, రైతుల సహకారంతో ఈ సవాళ్లను అధిగమించి తెలంగాణ వ్యవసాయాన్ని అభివృద్ధి పథంలో కొనసాగిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల పరిశీలన సూర్యాపేట జిల్లా పర్యటనలో భాగంగా గడ్డిపల్లి గ్రామంలో రూ.250 కోట్లతో నిర్మిస్తున్న సమీకృత (ఇంటిగ్రేటెడ్) పాఠశాల నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. అనంతరం హుజూర్‌నగర్‌లో రూ.7.25 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం, రూ.4.50 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాల పనులను సమీక్షించారు. అలాగే చిలుకూరు--జెర్రిపోతులగూడ మధ్య నూతనంగా నిర్మించిన బీటీ రహదారిని ప్రారంభించారు.

# జూన్‌లో రికార్డు స్థాయిలో 1.26 కోట్ల శ్రీవారి లడ్డూల విక్రయం

తిరుమల, జూలై 3

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం అనంతరం భక్తులకు ప్రసాదంగా అందించే శ్రీవారి లడ్డూల విక్రయం 2026 జూన్ నెలలో రికార్డు స్థాయికి చేరుకుంది. తిరుమలకు రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లడ్డూల తయారీని గణనీయంగా పెంచి, ఎలాంటి కొరత లేకుండా భక్తులకు నిరంతరాయంగా పంపిణీ చేసింది. టీటీడీ గణాంకాల ప్రకారం, 2026 ఏప్రిల్‌లో 1,11,96,170 లడ్డూలు, మే నెలలో 1,21,35,528 లడ్డూలు విక్రయించగా, జూన్ నెలలో ఈ సంఖ్య 1,26,81,805కు చేరి కొత్త రికార్డు సృష్టించింది. గత సంవత్సరాలతో పోలిస్తే కూడా ఈ పెరుగుదల విశేషంగా ఉంది. 2024 జూన్‌లో 1,02,64,364 లడ్డూలు విక్రయించగా, 2025 జూన్‌లో 1,19,21,353 లడ్డూలు విక్రయమయ్యాయి. ఈ ఏడాది జూన్‌లో గత ఏడాదితో పోలిస్తే 7,59,452 లడ్డూలు అధికంగా విక్రయమై 6.37 శాతం వృద్ధి నమోదైంది. అలాగే 2024 జూన్‌తో పోలిస్తే 24,17,441 లడ్డూలు ఎక్కువగా విక్రయమై 23.55 శాతం పెరుగుదల నమోదైంది. తిరుమలకు భక్తుల రాక నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో, శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీ, నిల్వ, పంపిణీ వ్యవస్థను టీటీడీ సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రతి భక్తుడికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రసాదం అందేలా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.



# అప్పులపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది:

**జూపల్లికి హరీశ్‌రావు బహిరంగ లేఖ**

హైదరాబాద్, జూలై 3

తెలంగాణ రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభ ఉపనేత టి. హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావుకు శుక్రవారం బహిరంగ లేఖ రాసిన ఆయన, తన వాదనలకు సంబంధించిన వీడియోలు, పత్రాధారాలను వాట్సాప్ ద్వారా పంపించారు.

**లేఖలో హరీశ్‌రావు మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న అప్పులపై ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు పదేపదే తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై ఇప్పటికే పలుమార్లు వాస్తవాలు వివరించినప్పటికీ అదే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వం తీసుకున్న రుణా లు, రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన రుణాలను కలిపి మొత్తం రూ.4.17 లక్షల కోట్లు మాత్ర మేనని తాను అసెంబ్లీలో స్పష్టంగా చెప్పానని, ఇప్పటికీ అదే లెక్కకు కట్టుబడి ఉన్నానని తెలిపారు. ఈ అంశంపై అసెంబ్లీలోనే బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ విసిరిన విషయాన్ని కూడా గుర్తు చేశారు.**

మంత్రి జూపల్లి కృష్ణారావు తన లేఖలో డిసెంబర్ 2023 నుంచి జూన్ 2026 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1,77,058 కోట్లు అప్పు చేసిందని పేర్కొ న్నారని, అయితే భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) గణాంకాల ప్రకారం 2026 జూన్ 30 నాటికి ఆ మొత్తం రూ.1,86,067 కోట్లకు చేరిందని హరీశ్‌రావు తెలిపారు. అదేవిధంగా, 2026 మార్చి 18న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ, ఎఫ్ఆర్‌బీఎం రుణాలు, ఇతర బాధ్య తలను కలిపి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు రూ.3,47,294 కోట్లుగా ఉన్నాయని చెప్పారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల విషయంలో మొదటి నుంచి ఒకే లెక్కను చెబుతోందని, కాంగ్రెస్ మాత్రం రాజకీయ అవసరాలకు అనుగుణంగా అప్పుల గణాంకా లను మారుస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. తమ లెక్కల ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ మార్గాల ద్వారా సుమారు రూ.4.5 లక్షల కోట్లు సమీకరించిందని పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావుకు వాట్సాప్ ద్వారా మూడు ఆధారాలను పంపినట్లు హరీశ్‌రావు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అప్పులపై తాను అసెంబ్లీలో చేసిన ప్రసంగం వీడియో, కాంగ్రెస్ ప్రభుత్వ అప్పులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన వీడియో, రాష్ట్ర అప్పులపై ఆర్బీఐ అధికారిక గణాంకాలను పంపినట్లు వెల్లడించారు. ఈ ఆధారాలను పరిశీలించి తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై ఇకపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేయవద్దని మంత్రి జూపల్లి కృష్ణారావును హరీశ్‌రావు కోరారు.



# సుజీత్ తదుపరి సినిమా ఏది?

**దర్శకుడు సుజీత్ తదుపరి ప్రాజెక్ట్ ఏదనే అంశంపై టాలీవుడ్‌లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. చాలా కాలంగా సహజ నటుడు నానితో సుజీత్ సినిమా చేయనున్నట్లు ప్రచారం సాగుతుండగా, తాజాగా పవన్ కళ్యాణ్‌తో ఓజీ--2' తెరకెక్కే అవకాశాలపై సినీ వర్గాల్లో కొత్త ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో సుజీత్ తర్వాతి చిత్రం ఏదనే అంశం అభిమానుల్లో ఉత్కంఠను రేకెత్తిస్తోంది.'రన్ రాజా రన్'లిచిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న సుజీత్, అనంతరం 'సాహో' వంటి భారీ చిత్రాన్ని తెరకెక్కించారు.**

హైదరాబాద్, జులై

ఆ తర్వాత పవన్ కళ్యాణ్‌తో 'ఓజీ' చిత్రాన్ని రూపొందించారు. 'సాహో'లిఅనంతరం నానితో సినిమా చేయాలని సుజీత్ భావించినట్లు, కథా చర్చలు కూడా జరిగినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే అదే సమయంలో పవన్ కళ్యాణ్ నుంచి అవకాశం రావడంతో ఆ ప్రాజెక్ట్ వాయిదా పడిందని సినీ వర్గాల్లో వార్తలు వినిపించాయి.ప్రస్తుతం సినీ పరిశ్రమలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం 'ఓజీ'లిసీక్వెల్‌కు సంబంధించిన కథా పనులు ప్రారంభమైనట్లు ప్రచారం సాగుతోంది. ఈ ఏడాది చివర్లో చిత్రాన్ని ప్రారంభించేలా సుజీత్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.మరోవైపు నాని--సుజీత్ కాంబినేషన్ కోసం అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. గతంలో నాని కూడా సుజీత్‌తో సినిమా తప్పకుండా ఉంటుందని పేర్కొనడం ఆసక్తిని పెంచింది. ప్రస్తుతం నాని 'ప్యారడైజ్' చిత్రీకరణలో బిజీగా ఉన్నారు. ఆ సినిమా పూర్తైన తర్వాత సుజీత్ దర్శకత్వంలో సినిమా పట్టాలెక్కే అవకాశాలు ఉన్నాయని గతంలో ప్రచారం జరిగినప్పటికీ, ఇప్పటివరకు అధికారిక సమాచారం మాత్రం వెలువడలేదు.

## జపాన్‌కు 'మిరాయ్' ప్రయాణం

హైదరాబాద్, జూలై

యువ కథానాయకుడు తేజ సజ్జ నటించిన ఫాంటసీ యాక్షన్ చిత్రం 'మిరాయ్' మరో కీలక మైలురాయిని చేరుకోబోతోంది. దేశీయ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న ఈ చిత్రం ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్‌లో అడుగుపెడుతోంది. ఆగస్టు 21, 2026న జపాన్‌లో 'మిరాయ్: విధి వీరుడు' పేరుతో చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఇటీవలి కాలంలో భారతీయ చిత్రాలకు జపాన్‌లో మంచి ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో 'మిరాయ్' విడుదలపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.'హనుమాన్' చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తేజ సజ్జ, ఆ తర్వాత 'మిరాయ్'తో మరో విజయాన్ని తన ఖాతాలో




వేసుకున్నారు. వినూత్న కథాంశం, అత్యాధునిక దృశ్య ప్రభావాలు, ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు అదే చిత్రాన్ని జపాన్‌లో విడుదల చేయడం ద్వారా అంతర్జాతీయ ప్రేక్షకులను ఆకట్టుకోవాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. ఫాంటసీ, సాహస గాథ, భావోద్వేగాలు, యాక్షన్ అంశాలను సమపాళ్లలో మేళవిస్తూ రూపొందించిన ఈ చిత్రం సాంకేతికంగా కూడా మంచి గుర్తింపు సంపాదించింది. ముఖ్యంగా అత్యాధునిక దృశ్య ప్రభావాలు, భారీ నిర్మాణ విలువలు, వినూత్న ప్రపంచ నిర్మాణం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దృశ్య సాంకేతికతకు పెద్దపీట వేసే జపాన్ ప్రేక్షకులకు ఈ అంశాలు మరింతగా నచ్చే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈ చిత్రంలో తేజ సజ్జ సరసన రితికా నాయక్ కథానాయికగా నటించగా, మంచు మనోజ్ ప్రతినాయకుడి పాత్రలో తన నటనతో ఆకట్టుకున్నారు.




## 'నాగబంధం' మూవీ రివ్యూ..

### విజువల్స్ ఆకట్టుకున్నా కథలో తడబాటు

హైదరాబాద్, జులై

నిర్మాణ దశ నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించిన 'నాగబంధం' శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భారీ గ్రాఫిక్స్, ఆధ్యాత్మిక నేపథ్యం, యాక్షన్ అంశాలతో రూపొందిన ఈ దివ్య థ్రిల్లర్‌కు అభిషేక్ నామా దర్శకత్వం వహించగా, విరాట్ కర్ణ హీరోగా నటించారు. ప్రచార చిత్రాలతో భారీ అంచనాలు ఏర్పరచుకున్న ఈ సినిమా ఆ అంచనాలను ఎంతవరకు అందుకుందో చూద్దాం.కథ : అనాథ అయిన రుద్రను పద్మమ్మ తన సొంత కుమారుడిలా పెంచుతుంది. తన చెల్లెలి వివాహాన్ని ఘనంగా జరిపించాలని రుద్ర కలలు కంటాడు. అయితే వివాహ సమయంలో రంగనాథస్వామి ఆలయంలోని బ్రహ్మకమలం కోసం జుల్ఫికర్ అలీ దాడి చేయడంతో రుద్ర కుటుంబం విషాదంలో చిక్కుకుంటుంది. వేల ఏళ్లుగా పూజలందుకుంటున్న బ్రహ్మకమలానికి రుద్రకు ఉన్న అనుబంధం ఏమిటి? దానిని స్వాధీనం చేసుకోవడానికి పురావస్తు శాస్త్రవేత్త ప్రభాకర్, అతని కుమార్తె పార్వతి చేసిన ప్రయత్నాలు ఏంటి? నాగబంధం గ్రంథం, గరుడ మంత్రాల సహాయంతో అమరత్వం పొందాలనుకున్న జుల్ఫికర్ అలీ, భైరాగి లక్ష్యం ఏమిటి? కైలాస పర్వతంలోని ఆలయ రహస్యం ఏంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే సినిమా కథ.



## సమంత నటనపై అఖిల్ ప్రశంసలు

హైదరాబాద్, జులై

అక్కినేని యువ హీరో అఖిల్ నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్' జులై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసింది. ఈ సందర్భంగా వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న అఖిల్, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో టాలీవుడ్‌లో ఘన విజయం సాధించిన మా ఇంటి బంగారం' చిత్రం, అందులో కథానాయిక సమంత నటనపై ప్రశంసలు కురిపించారు.తాను ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉండటంతో ఇప్పటి వరకు 'మా ఇంటి బంగారం'లిసినిమాను చూసే అవకాశం రాలేదని, అయితే చిత్ర ప్రచార దృశ్యాలను మాత్రం వీక్షించానని అఖిల్ తెలిపారు. వాటిని చూసిన వెంటనే సినిమా తప్పకుండా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం కలిగిందని చెప్పారు. ఒక మంచి కుటుంబ కథను భావోద్వేగాలతో మేళవిస్తూ, దానికి శక్తివంతమైన పోరాట ఘట్టాలను జోడించి ఎంతో కొత్తగా, సహజంగా తెరకెక్కించడం విశేషమని కొనియాడారు. ఒక ఇంటికి కోడలిగా వెళ్లిన యువతి ఆ కుటుంబ సభ్యులందరి ప్రేమాభిమానాలను సంపాదించుకునే కథాంశాన్ని వినూత్నంగా ఆవిష్కరించారని అభిప్రాయపడ్డారు.

### డీప్‌ఫేక్‌లపై కోర్టుకు ప్రీతి జింటా

ముంబై, జులై

:బాలీవుడ్ ప్రముఖ నటి ప్రీతి జింటా తన అనుమతి లేకుండా కృత్రిమ మేధ సాంకేతికతతో రూపొందించిన డీప్‌ఫేక్ చిత్రాలు, మార్ఫింగ్ చేసిన అభ్యంతరకర కంటెంట్‌పై బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతున్న అలాంటి చిత్రాలు, వీడియోలు, లింకులను పూర్తిగా తొలగించేలా అత్యవసర ఆదేశాలు జారీ చేయాలని ఆమె కోర్టును కోరారు.ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి మాధవ్ జామదార్ ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం, అభ్యంతరకర కంటెంట్‌ను వెబ్‌సైట్ల నుంచి తొలగించేందుకు సులభమైన, ఆచరణ సాధ్యమైన విధానాన్ని రూపొందించాలని సూచించారు. ఈ కేసు తదుపరి విచారణను జులై 6కు వాయిదా వేశారు.ప్రీతి జింటా దాఖలు చేసిన వ్యాజ్యంలో ప్రముఖ సాంకేతిక సంస్థలు, సామాజిక మాధ్యమ వేదికలు, డొమైన్ నేమ్ నమోదు సంస్థలను ప్రతివాదులుగా చేర్చారు. నటి తరఫున హాజరైన న్యాయవాది డీప్‌ఫేక్ సాంకేతికత రోజురోజుకూ మరింత అధునాతనంగా మారుతోందని, దీనివల్ల వ్యక్తిగత గోప్యతతో పాటుప్రతిష్ఠకు తీవ్ర నష్టం జరుగుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అందువల్ల అభ్యంతరకర కంటెంట్‌కు సంబంధించిన లింకులను వెంటనే తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.మరోవైపు ప్రతివాద సంస్థల తరఫు న్యాయవాదులు స్పందిస్తూ, కోర్టు సూచించిన అభ్యంతరకర లింకులను తొలగించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. అయితే చట్టబద్ధంగా ఉన్న సాధారణ కంటెంట్‌ను ముందస్తుగా పర్యవేక్షించి నిరోధించే విధమైన ఆదేశాలు జారీ చేయవద్దని కోర్టును అభ్యర్థించారు.ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన న్యాయస్థానం, సాధారణ వినియోగదారుల కంటెంట్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, కేవలం అభ్యంతరక రమైన డీప్‌ఫేక్, మార్ఫింగ్ కంటెంట్‌ను మాత్రమే వేగంగా తొలగించే విధంగా ఒక ఆచరణాత్మక విధానాన్ని రూపొందించాలని సూచించింది.



## కోర్టుకు ప్రీతి జింటా



## ప్రతిపాదనలపై అంజలి ఆసక్తికర వ్యాఖ్యలు

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తన నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి అంజలి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ముఖ్యంగా తనకు వచ్చిన ప్రేమ ప్రతిపాదనలు, పాఠశాల రోజులలో జరిగిన ఓ సంఘటన గురించి ఆమె చెప్పిన విషయాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.తెలుగులో 'ఫోటో' సినిమాతో సినీ ప్రయాణాన్ని ప్రారంభించిన అంజలి, 'షాపింగ్ మాల్', 'జర్నీ', 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు'లిలి, లిలి'గీతాంజలి'లి, వకీల్ సాబ్', 'గేమ్ ఛేంజర్', 'మదగజరాజా'లివంటి చిత్రాల ద్వారా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు పొందారు. గ్లామర్ కంటే నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలనే ఎక్కువగా ఎంపిక చేసుకుంటూ తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకున్నారు. ప్రస్తుతం తెలుగులో సినిమాలు తక్కువగా చేస్తున్నప్పటికీ తమిళంలో వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు.

ఇంటర్వ్యూలో భాగంగా వ్యాఖ్యాత అడిగిన ఓ ప్రశ్నకు స్పందించిన అంజలి, పాఠశాల రోజుల్లో తనను ఇష్టపడిన ఓ విద్యార్థికి రాఖీ కట్టిన సంఘటనను గుర్తు చేసుకున్నారు. ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు అతను తనకు ప్రేమను వ్యక్తం చేస్తూనే ఉండేవాడని, చివరకు అతని పట్టుదలకు ముగింపు పలకాలని భావించి పదో తరగతిలో రాఖీ కట్టానని తెలిపారు.అయితే రాఖీ కట్టిన తర్వాత కూడా అతను దానిని అంగీకరించకుండా తీసి పడేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడని, ఆ తర్వాత అతడిని మళ్లీ ఎప్పుడూ చూడలేదని అంజలి చెప్పారు. ఆ సంఘటన ఇప్పటికీ తనకు గుర్తుండిపోయిందని పేర్కొన్నారు.సినీ పరిశ్రమలో ఎదురైన ప్రేమ ప్రతిపాదనల గురించి కూడా ఆమె స్పందించారు. చిత్రీకరణల సమయంలో అభిమానులు, సహనటులు, పరిచయస్తుల నుంచి ప్రేమ ప్రతిపాదనలు రావడం సాధారణ విషయమేనని చెప్పారు. అయితే అలాంటి ప్రతిపాదనలను తాను ఎప్పుడూ వ్యక్తిగతంగా తీసుకోలేదని, ప్రతి అభిమానం ప్రేమగా మారదని స్పష్టం చేశారు. చాలావరకు ఆప్యాయత మాత్రమేనని, వాటిని అదే కోణంలో స్వీకరించానని వెల్లడించారు.

“This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467